పాలకుల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం

- పట్టణంలో తాగునీటి సరఫరాలో తాత్సారం
- నిలిచిపోయిన రూ.20 కోట్ల ప్రాజెక్టు పనులు
- 3 ఓహెచ్‌ఆర్‌లకు గానూ ఒక్కటే పూర్తి
- శివారు ప్రాంతాలకు ట్యాంకర్లతో సరఫరా
- వైఎస్సార్ సీపీ పాలనలో నిధుల మంజూరు

అమలాపురం టౌన్: నాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దూర దృష్టితో రానున్న 25 ఏళ్లలో పట్టణ ప్రజలకు తాగునీటి కష్టాలు లేకుండా రూ.20 కోట్లతో మంజూరు చేసిన తాగునీటి ప్రాజెక్టు పనులు నేడు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు దాటుతున్నా దీని పురోగతిపై దృష్టి సారించిన పాపాన పోలేదు. పట్టణంలో తాగునీటి కష్టాలను పాలకులు ప్రత్యక్షంగా చూస్తున్నా ప్రాజెక్టును వేగవంతంగా పూర్తి చేసి ప్రజల దాహార్తిని తీర్చాలన్న స్పృహ రాకపోవటం దురదృష్టకరం. ప్రాజెక్టు పూర్తి కాకపోవడంతో నేటికీ పట్టణ పరిధిలోని శివార్లకు తాగునీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాల్సిన దుస్థితి అనివార్యమవుతోంది. పట్టణ పేదలకు అల్లవరం మండలం బోడసకుర్రులో నిర్మించిన టిడ్కో ఇళ్ల సముదాయంలో నీటి వసతి కల్పించకపోవడంతో అక్కడి నివాసితులు 'దాహమో రామచంద్రా' అంటున్నా ఎవరికీ పట్టని పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వంలో అప్పటి మంత్రి పినిపే విశ్వరూప్ ఈ ప్రాజెక్టుకు రూ.20 కోట్ల నిధులను మంజూరు చేయించి పనులను మొదలు పెట్టించారు. పట్టణ ప్రజలకు భవిష్యత్తులో సైతం ఢోకా లేకుండా తాగునీటిని అందించాలని విశ్వరూప్ తపించారు. అయితే ప్రాజెక్టు నిర్మాణంలో జరుగుతున్న జాప్యం ప్రజలకు శాపంగా మారింది.



అమలాపురం పట్టణం గాంధీనగర్‌లో నిర్మాణం పూర్తయినా నిరుపయోగంగా మారిన ఓహెచ్‌ఆర్ ట్యాంకు

నిర్మించినా నిరుపయోగమే

ఈ తాగునీటి ప్రాజెక్టులో మొత్తం మూడు భారీ ఓహెచ్‌ఆర్ ట్యాంక్‌లు నిర్మించాల్సి ఉండగా ఒకే ఒక్క ఓహెచ్‌ఆర్ పూర్తి చేసి పనులను అసంపూర్తిగా, అర్ధాంతరంగా నిలిపేశారు. ప్రాజెక్టులో భాగంగా గాంధీనగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, ఏవీఆర్ నగర్‌లో మూడు ఓహెచ్‌ఆర్‌లు నిర్మాంచాల్సి ఉంది. అయితే ఒక్క గాంధీనగర్‌లోనే ఓహెచ్‌ఆర్ నిర్మాణాన్ని పూర్తి చేసి నిరుపయోగంగా వదిలేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వస్తే తాగునీటి ఇక్కట్లు పూర్తిగా దూరమవుతాయి. పట్టణంలో ఎంపిక చేసిన మూడు శివార్లలో భారీ ఓహెచ్‌ఆర్‌లు నిర్మించడం వల్ల అన్ని ప్రాంతాలకు తాగునీరు పుష్కలంగా అందుతుంది.



పట్టణంలోని 20వ వార్డులో ట్యాంకర్ ద్వారా నీటిని పట్టుకుంటున్న స్థానికులు

అందుబాటులోకి వస్తే..

ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే పట్టణంలో జీవిస్తున్న దాదాపు 53 వేల మంది జనాభాకు తలా 135 లీటర్ల చొప్పున నీరు నిత్యం అందే పరిస్థితి ఉంటుంది. ఇప్పుడు మున్సిపల్ వాటర్ వర్క్స్ ద్వారా రోజుకు 60 లక్షల లీటర్ల తాగునీరు మాత్రమే పట్టణ ప్రజలకు సరఫరా అవుతోంది. ప్రస్తుతం అందుతున్న తాగునీటి ద్వారా తలా 70 నుంచి 80 లీటర్ల నీరు మాత్రమే నిత్యం అందుతోంది. ప్రస్తుతం తాగునీటి వనరుల పరంగా చూస్తే మూడు రిజర్వాయర్లు (చెరువులు), మూడు ఓహెచ్‌ఆర్‌లు ఉన్నాయి. వీటి ద్వారానే పట్టణ ప్రజలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అదే రూ.20 కోట్ల ప్రాజెక్టు పనులు పూర్తయితే పట్టణమంతా ప్రజలకు సరి సమానంగా తాగునీరు అందే పరిస్థితి ఉంటుంది. ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసే దైన్య స్థితి ఉండదు.

> **త్వరలోనే విధి విధానాలు**
>
> అమలాపురం మున్సిపాలిటీకి గతంలో మంజూరైన తాగునీటి ప్రాజెక్టుకు సంబంధించి మిగిలిన రెండు ఓహెచ్‌ఆర్‌ల నిర్మాణాన్ని చేపట్టేందుకు ఉన్నతాధికారులకు నివేదించాం. నిలిచిపోయిన పనులను తిరిగి చేపట్టేందుకు త్వరలోనే విధి విధానాలు వస్తాయి. దానికి అనుగుణంగా పనులు పునఃప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాం.
>
> హుస్సేన్, పబ్లిక్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, అమలాపురం.

క్లుప్తంగా

నూతన బస్సులు ప్రారంభం

అమలాపురం రూరల్: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో కొత్తగా మంజూరైన ఐదు బస్సులను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు స్థానిక బస్ కాంప్లెక్స్ వద్ద ఆదివారం ప్రారంభించారు. కొత్త బస్సులు హైదరాబాద్, విజయవాడ, శ్రీశైలం, విశాఖపట్నం ప్రాంతాలకు నడుపుతామని ఎమ్మెల్యే తెలిపారు. డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ డిపోకు ఏడాది కాలంలో 26 కొత్త బస్సులు మంజూరైనట్లు చెప్పారు. వీటిలో ఇంద్ర, సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్ వంటి బస్సులు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, విజిలెన్సు అధికారి నాగమునీంద్ర, గ్యారేజ్ ఇన్‌చార్జి జీఆర్‌ఎల్ దేవి, ట్రాఫిక్ ఇన్‌చార్జి ప్రతిమా కుమారి, ఓపీఆర్‌ఎస్ ఇన్‌చార్జి వరహాల బాబు, సూపర్ వైజర్లు, నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతకు మాజీ మంత్రి విశ్వరూప్ పరామర్శ



బాబ్జీని పరామర్శిస్తున్న మాజీ మంత్రి విశ్వరూప్ దంపతులు

అమలాపురం టౌన్: పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు ఉండ్రు బాబ్జీ అనారోగ్యానికి గురై శస్త్ర చికిత్స చేయించుకున్నారు. హైదరాబాద్‌లోని తన సోదరుడి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పినిపే విశ్వరూప్, బేబీ మీనాక్షి దంపతులు హైదరాబాద్‌లో బాబ్జీని ఆదివారం పరామర్శించారు. ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. విశ్వరూప్ దంపతులతో పాటు వారి తనయుడు డాక్టర్ శ్రీకాంత్ సైతం బాబ్జీని పరామర్శించారు.

కలెక్టరేట్‌లో రేపు జాబ్‌మేళా

అమలాపురం రూరల్: కలెక్టరేట్‌లో వికాస సంస్థ జిల్లా కార్యాలయంలో మంగళవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రావిలాల మహేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు వారి అర్హతకు తగిన విధంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తారన్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆయా కంపెనీల మానవ వనరుల అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని వికాస సంస్థ జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఉదయం 9 గంటలకు అన్ని రకాల ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఇతర ధ్రువీకరణ పత్రాలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

ఓఎన్‌జీసీ పరిహారం జీఓ విడుదల

యానాం: నియోజకవర్గ మత్స్యకారులకు ఓఎన్‌జీసీ నష్ట పరిహారం పంపిణీకి సంబంధించిన జీఓను ఆదివారం పుదుచ్చేరి చీఫ్ సెక్రటరీయేట్(ఫిషరీస్) ఏ పునీతమేరీ జారీ చేశారు. ఓఎన్‌జీసీ సంస్థ రెండో గ్యాస్ పైపులైన్‌ను వేస్తున్న నేపథ్యంలో జరిగిన నష్టానికి 15 నెలల కాలానికి గానూ అర్హులైన మత్స్యకారుల జీవనోపాధి పరిహారాన్ని రీజినల్ అడ్మినిస్ట్రేటర్ పేరిట సంస్థ జమ చేసిందని తెలిపారు. గతంలో జాబితాలో వివిధ కారణాలతో పేర్లు కోల్పోయిన 187 మంది అర్హులైన మత్స్యకారులు, 44 మంది సింగిల్ విడోలకు సంబంధించి సొమ్మును సైతం విడుదల చేసినట్లు చెప్పారు. ఈ మొత్తాన్ని లబ్ధిదారుల బ్యాంకు అకౌంట్లలో జమ చేయాలని మత్స్యశాఖ ఏడీని ఆదేశించారు. మత్స్యకారులకు నష్ట పరిహారం పంపిణీ పట్ల ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావులు హర్షం వ్యక్తం చేశారు. వేర్వేరు ప్రకటనల్లో వారు పుదుచ్చేరి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

'గేదెల రాజు' సినిమా పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు, చిత్ర దర్శక, నిర్మాతలు

అమలాపురం టౌన్: ఉప్పలగుప్తం మండలానికి చెందిన సినీ డైరెక్టర్ మోటూరి చైతన్య, చిత్ర నిర్మాత మోటూరి రవికుమార్‌లు నిర్మించిన 'గేదెల రాజు' సినిమా చిత్రీకరణ పూర్తి చేసుకుంది. ఈ చిత్రం పోస్టర్లను స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిత్రం దర్శక, నిర్మాతలు చైతన్య, రవికుమార్‌లు మాట్లాడుతూ త్వరలోనే చిత్రాన్ని విడుదల చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో చిక్కం భీముడు, వెంకట కృష్ణ, నాగులపల్లి రాజు, కోడి శివ తదితరులు పాల్గొన్నారు.

వీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్టుకు విరాళం

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వరస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు శనివారం ఓ భక్తుడు విరాళం అందించారు. హైదరాబాద్‌కు చెందిన బోదరాజు సూర్యనారాయణ మూర్తి దంపతులు రూ.10,116 విరాళంగా అందజేశారు. దాతకు అర్చకులు యనమండ్ర సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రత్యేక దర్శనం కల్పించారు. శేష వస్త్రం, స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించి సత్కరించారు. దేవదాయశాఖ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ దాతను అభినందించారు.

మురమళ్లలో సంక్రాంతి సందడి

ఐ.పోలవరం: మండలంలోని మురమళ్లలో ముందస్తు సంక్రాంతి వేడుకలతో విద్యార్థులు సందడి చేశారు. స్థానిక ప్రైవేటు కాన్వెంట్‌లో ఆదివారం సంక్రాంతి పండగ సంబరాలను నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి భోగి మంటలు వేశారు. మంటల చుట్టూ తిరుగుతూ ఉత్సాహంగా పాటలు పాడారు. రంగు రంగుల ముగ్గులతో ఆ ప్రాంతాన్ని అందంగా తీర్చిదిద్దారు. మురమళ్ల వీరేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు, పాఠశాల కరస్పాండెంట్ పెనుమత్స కామరాజు ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి.



భోగి మంటల చుట్టూ కలియ తిరుగుతున్న విద్యార్థినులు

నేటి నుంచి ప్రజా ఉత్సవాలు ప్రారంభం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న పుదుచ్చేరి వ్యవసాయ మంత్రి జయకుమార్, చిత్రంలో మల్లాడి, ఆర్‌ఏఓ మునిస్వామి తదితరులు



ఫల, పుష్ప ప్రదర్శనకు ఉంచిన మొక్కలు

- హాజరు కానున్న సీఎం రంగసామి
- ఫల, పుష్ప ప్రదర్శనకు ఏర్పాట్లు పూర్తి

యానాం: ప్రజా ఉత్సవాలు ఈ నెల 6 నుంచి 8 వరకు మూడు రోజుల పాటు అందరినీ అలరించనున్నాయి. దీనికి తోడు ఫల,పుష్ప ప్రదర్శన సైతం చూపరులను కనువిందు చేయనుంది. ఈ రెండు కార్యక్రమాలను పుదుచ్చేరి సీఎం రంగసామి ప్రారంభించనున్నారు. ఆయనతో పాటు పుదుచ్చేరి నుంచి మంత్రుల బృందం సైతం తరలి రానుంది. ఫల, పుష్ప ప్రదర్శన ఏర్పాట్లను చూసేందుకు వచ్చిన వ్యవసాయ మంత్రి జయకుమార్‌కు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు స్వాగతం పలికారు. మిగిలిన మంత్రులు సైతం సోమవారానికి చేరుకోనున్నారు. ముఖద్వారం, ప్రదర్శనల వేదికను సైతం అందంగా తీర్చిదిద్ది ఏర్పాట్లు పూర్తి చేశారు. మత్స్యకారులకు ఓఎన్‌జీసీ పరిహారం పంపిణీతో పాటు మెట్టకూరు గణపతినగ్‌లో సీఎస్‌ఆర్ నిధులతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు సీఎం రంగసామి భూమి పూజ చేయనున్నారు.

ప్రజా ఉత్సవాలను విజయవంతం చేయాలి

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వం ఆధ్వర్యంలో సుమారు రూ.47 లక్షల ఖర్చుతో సోమవారం నుంచి స్థానిక బాలయోగి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్న యానాం ప్రజా ఉత్సవాలను విజయవంతం చేయాలని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు కోరారు. ఆదివారం ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. ప్రోటోకాల్ ప్రకారం ఆహ్వాన పత్రంపై ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌ను సభాధ్యక్షుడిగా ప్రచురించామన్నారు. పట్టుదలకు పోకుండా ఆయన సైతం ఉత్సవాలకు హాజరవుతారని తాను భావిస్తున్నట్లు చెప్పారు. ప్రజా ఉత్సవాలకు కేటాయించిన ప్రభుత్వ నిధులతో పాటు తాను కొంత మొత్తంలో సొంత నిధులను సైతం వెచ్చిస్తున్నట్లు వెల్లడించారు. ప్రత్యేక ఆకర్షణ కోసం దర్శకుడు సుకుమార్‌తో మాట్లాడి పుష్ప–2 షూటింగ్‌లో ఉపయోగించిన ఎర్రచందనం దుంగలు, తదితర సామాగ్రిని రప్పించినట్లు తెలిపారు.

నేడు ఓటర్ల తుది జాబితా విడుదల

యానాం: నియోజకవర్గ ఓటర్ల తుది జాబితాను ఈ నెల 6వ తేదీన విడుదల చేయనున్నట్లు ఆదివారం ఆర్‌ఏఓ, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి మునిస్వామి ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే జనవరి 1 వరకు ప్రజల నుంచి వచ్చిన పలు అభ్యంతరాలు, మార్పులు, చేర్పులను సమ్మరీ రివిజన్ చేసినట్లు చెప్పారు. రాజకీయ పార్టీలు, ఆయా పార్టీల అధ్యక్షుల సమక్షంలో 33 భాగాలుగా ఉన్న తుది ఓటర్ల జాబితాను విడుదల చేసి అందజేయనున్నట్లు తెలిపారు.

ఘనంగా అర్ధ శతాబ్ది కళోత్సవ సంబరాలు

అమలాపురం టౌన్: పట్టణంలో మానవతా స్వచ్ఛంద సేవా సమితి ఏర్పడి 50 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని స్థానిక రోటరీ కల్యాణ మండపంలో అర్ధ శతాబ్ది కళోత్సవ సంబరాలు ఆదివారం సాయంత్రం ఘనంగా జరిగాయి. సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, న్యాయవాది ముషిణి రామకృష్ణారావు అధ్యక్షతన జరిగిన ఈ ఉత్సవాల్లో వివిధ కళలకు చెందిన కళాకారులు పాల్గొన్నారు. కవులు, కళాకారులను రామకృష్ణారావు సాదరంగా ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. మాజీ ఎంపీ ఏజేబీ మహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తదితరులు పాల్గొని ప్రసంగించారు. మానవతా విలువల పరిరక్షణపై సెమినార్ నిర్వహించారు. వేదికపై పలు సాంస్కృతిక ప్రదర్శనలు, పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పేదలకు వస్త్రదానం చేశారు. కళాకారులను సత్కరించారు. అమలాపురానికి చెందిన ప్రవాస భారతీయుడు సీహెచ్. త్రినాథరావు (అమెరికా) పాల్గొని ప్రసంగించారు. కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మ, కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ తదితరులు ప్రసంగించారు. వేడుకల్లో భాగంగా డాక్టర్ యనమదల మురళీకృష్ణకు వైద్య శిరోమణి అవార్డును సేవా సమితి అధ్యక్షుడు రామకృష్ణారావు ప్రదానం చేశారు. డాక్టర్ మురళీకృష్ణ ఎయిడ్స్ రోగులకే కాక కోవిడ్ సమయంలో ఎందరో రోగులకు అందించిన సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు.



డాక్టర్ మురళీకృష్ణను సత్కరిస్తున్న సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రామకృష్ణారావు తదితరులు

గుక్కెడు నీటి కోసం రోడ్డెక్కిన మహిళలు



కాట్రేనికోనలోని గొల్లల వీధిలో కుళాయిల నుంచి నీరు రాకపోవడంతో బిందెలతో రోడ్డెక్కిన మహిళలు

కాట్రేనికోన: మండల కేంద్రం కాట్రేనికోన పరిధిలోని గొల్లలవీధిలో ఇంటింటికీ తాగునీటి కుళాయిలు వేసినప్పటి నుంచి ట్యాపుల ద్వారా సక్రమంగా తాగునీరు రావడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజులకు ఓసారి కుళాయి వస్తోందని, బిందె నీరు కూడా రావడం లేదని వాపోయారు. పైపులైను వెంబడి కుళాయిలకు అక్రమ విద్యుత్ మోటర్లు వేయడంతోనే ఈ సమస్య ఉత్పన్నమవుతోందని రాష్ట్ర మత్స్యశాఖ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగిడి నాగేశ్వరరావుకు మొర పెట్టుకున్నారు. ఏడాది నుంచి మంచి నీటి సమస్య వేధిస్తోందని వారం రోజుల నుంచి సమస్య మరింత ఎక్కువైందన్నారు. తమ గోడును పట్టించుకునేవారు లేక ఆగ్రహించిన మహిళలు రోడ్డుపై బిందెలతో ఆందోళనకు దిగారు. సంబంధిత అధికారులు స్పందించి అక్రమ విద్యుత్ మోటర్లు తొలగించి మంచినీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు బేబి, కుమారి, లక్ష్మి, సత్యవతితో పాటు మరికొందరు మహిళలు విన్నవిస్తున్నారు.

జూద క్రీడలకు దూరంగా ఉండాలి



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న కోరంగి ఎస్సై సత్యనారాయణ

తాళ్లరేవు: సంక్రాంతి పండగ నేపథ్యంలో ప్రజలు జూద క్రీడలకు దూరంగా ఉండాలని కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ కోరారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు ఆదివారం కోరంగి పంచాయతీ పాతకోరంగి గ్రామంలో వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.

హైందవ శంఖారావానికి తరలిన జనం

- జిల్లా నుంచి తరలివెళ్లిన 10 వేల మందికి పైగా భక్తులు
- విజయవాడకు పరుగులు తీసిన ప్రత్యేక వాహనాలు
- ఎటుచూసినా కాషాయ వర్ణ శోభితమే
- హోరెత్తిన జై శ్రీరామ్ నినాదాలు

అమలాపురం టౌన్: విజయవాడలో ఆదివారం జరిగిన హైందవ శంఖారావం మహాసభకు జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది జై శ్రీరామ్ నినాదాలతో తరలి వెళ్లారు. జిల్లాలోని పట్టణాలు, గ్రామాల నుంచి ప్రత్యేక బస్సులు, కార్ల మీద భక్తుల తరలి వెళ్లడంతో పండగ వాతావరణం నెలకొంది. దాదాపు 200 ప్రత్యేక బస్సులు, 175 కార్లు విజయవాడకు పరుగులు పెట్టాయి. అమలాపురం, రామచంద్రపురం, మండపేట, ముమ్మిడివరం నగర పంచాయతీతో పాటు జిల్లాలోని అన్ని ముఖ్య కూడళ్ల నుంచి భక్తులు బయలుదేరి వెళ్లారు. అమలాపురం గడియారం స్తంభం సెంటరు నుంచి 30 బస్సులకు పైగా వెళ్లాయి. రామచంద్రపురం, మండపేట నుంచి 40 బస్సుల్లో బయలు దేరారు. మండల కేంద్రాల నుంచే కాక పలు మేజర్ పంచాయతీల నుంచి సైతం ప్రత్యేక వాహనాల్లో ఆదివారం తెల్లవారు జాము నుంచి ఉదయం పది గంటల వరకూ వాహనాలు వెళుతూనే ఉన్నాయి. జిల్లా విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ), ఆర్‌ఎస్‌ఎస్, భజరంగ్‌దళ్‌తో పాటు పలు ధార్మిక సంస్థల ప్రతినిధుల ఆధ్వర్యంలో విజయవాడకు పయనమయ్యారు. జిల్లా నుంచి దాదాపు 100 మంది వీహెచ్‌పీ, భజరంగ్ దళ్, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు విజయవాడకు రెండు రోజుల క్రిందటే వెళ్లి అక్కడ సభాస్థలి వద్ద సేవలు అందిస్తున్నారు. దాదాపు 500 మందికి పైగా భక్తులు శనివారం రాత్రే విజయవాడకు వెళ్లారు. మరో 150 మంది వరకూ ద్విచక్ర వాహనాలపై తరలివెళ్లారు. జిల్లా వీహెచ్‌పీ అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం, ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా ప్రతినిధులు డాక్టర్ గోదశి గంగరాజు, బొరుసు జగదీష్, భజరంగ్ దళ్ రాష్ట్ర నాయకుడు శిరంగు నాయుడు తదితరుల ఆధ్వర్యంలో జిల్లా నుంచి విజయవాడకు హిందువుల యాత్ర జరిగింది.

అల్లవరం: విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో విజయవాడలో ఆదివారం తలపెట్టిన హైందవ శంఖారావం బహిరంగ సభకు అల్లవరం మండలం నుంచి వేలాదిగా హైందవులు తరలి వెళ్లారు. గ్రామ గ్రామన ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో కాషాయ జెండాలు చేతబూని జై శ్రీరామ్ నినాదాలతో ముందుకు సాగారు. మండలంలోని మొగళ్లమూరు, తూర్పులంక, అల్లవరం, బెండమూర్లంక, కొమరగిరిపట్నం తదితర గ్రామాల నుంచి విజయవాడకు బయలుదేరారు.



అమలాపురం గడియారం స్తంభం సెంటరు నుంచి విజయవాడకు బయలు దేరుతున్న స్థానికులు

ఉప్పలగుప్తం: విజయవాడలో జరిగిన హైందవ శంఖారావానికి ఆదివారం స్థానిక భక్తులు బయలుదేరి వెళ్లారు. అభయాంజనేయ ట్రస్టు వ్యవస్థాపకులు మోటూరి రవికుమార్, చిక్కం నాగబాబు, దొంగ బాబి, పందు సత్యనారాయణ, సలాది గణపతి, మేడిద రెడ్డినాయుడు, చీకట్ల వెంకయ్యనాయుడు తదితరులు ఉన్నారు.

చిన్నారులకు దుస్తుల అందజేత



నూతన వస్త్రాలతో చిన్నారులు

తాళ్లరేవు: స్థానిక పరదేశమ్మపేటలోని ఆనంద నిలయంలోని చిన్నారులు, మహిళలకు పలువురు దాతలు నూతన వస్త్రాలు అందజేసి భోజనాలు పెట్టించారు. యానాంకు చెందిన తలాటం ప్రకాశరావు, ఆయన మిత్రులు పబ్బినీడి ఏసుబాబు, పెద్దిరెడ్డి బాబి, కవల కోటేశ్వరరావు, కాట్ర వీరేశ్వరరావు తదితరులు చిన్నారులకు నూతన వస్త్రాలను సమకూర్చారు. సంస్థ డైరెక్టర్ దొమ్మేటి వసంతరావు, ఆనంద నిలయం ప్రతినిధి, తాళ్లరేవు జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్ తదితరులు దాతలను అభినందించారు.

వెంకన్నకు లక్ష తులసి పూజ



వేంకటేశ్వర స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో దేవ తిలకుల భక్త బృందం ఆధ్వర్యంలో ధనుర్మాస లక్ష తులసి పూజ ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు పెద్దింటి వెంకట సత్యనారాయణాచార్యులు, శ్రీనివాసుల విజయ గోపాలాచార్యులు, పెద్దింటి పండు ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు పూజా క్రతువులను నిర్వహించారు. విష్వక్సేన పూజ, పంచామృతాభిషేకం, పుణ్యాహ వచనం, నివేదన, గోపూజ, పూర్ణాహుతి, శాంతి కల్యాణం తదితర పూజాదికాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. దేవ తిలకుల భక్త బృంద ప్రతినిధులు ఈ పూజాదికాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సాయంత్రం జరిగిన అన్న సమారాధనలో వేలాది మంది భక్తులు పాల్గొని స్వామి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ ఈవో యర్రా వెంకటేశ్వరరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ జంగా అబ్బాయి వెంకన్న, కమిటీ సభ్యులు, భక్తులు, దేవ తిలకుల సామాజిక వర్గీయులు పాల్గొన్నారు.

ఆక్వా చెరువులో అనధికార తవ్వకాలు



మొగళ్లమూరు ఆక్వా చెరువులో పొక్లెయిన్‌తో తవ్వకాలు

అల్లవరం: మండలంలోని మొగళ్లమూరు రెవెన్యూ పరిధిలోని ఆక్వా చెరువులో అనధికార తవ్వకాలను ఆదివారం చేపట్టారు. ఆదివారం సెలవు దినం కావడంతో అధికారులెవ్వరూ స్థానికంగా అందుబాటులో ఉండరని తెలిసి ఓ ఆక్వా రైతు ఐదెకరాల్లో ఆక్వా చెరువు తవ్వకాలకు తెర తీశారు. ఇప్పుడు తవ్వుతున్న చెరువుల స్థానంలో గతంలో ఆక్వా సాగు జరిగేది. అప్పట్లో ఈ చెరువుల వద్ద జనరేటర్ లాగుతుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్ వైర్లు తెగిపడి ఇద్దరు మత్స్యకారులు మృతి చెందారు. అప్పటి నుంచి ఆక్వా సాగు మానేసి కొంత కాలం వరిసాగు చేశారు. అయితే ఇప్పుడు మళ్లీ ఆక్వా సాగు చేసేందుకు అప్పట్లో మత్స్యశాఖ జారీ చేసిన సర్టిఫికెట్ల ఆసరాతో చెరువుల తవ్వకాలు చేస్తున్నారు. ఆ సర్టిఫికెట్లకు కాలం చెల్లడంతో తవ్వకాలు ఎలా చేస్తారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. దీనిపై తహసీల్దార్ వీవీఎల్ నరసింహారావుని వివరణ కోరగా తవ్వకాలు చేపడుతున్న ప్రాంతాన్ని పరిశీలించాలని వీఆర్‌ఓకు ఆదేశించినట్లు చెప్పారు. అనుమతులు లేకుండా చెరువు తవ్వితే నోటీసులు ఇవ్వడం జరుగుతుందన్నారు.

బెనిఫిట్ షో జీఓ ఉపసంహరించుకోవాలి

తాళ్లరేవు: కొత్తగా విడుదలవుతున్న రెండు సినిమాల టిక్కెట్ల ధర పెంచుతూ ప్రభుత్వం విడుదల చేసిన జీఓను తక్షణం ఉపసంహరించుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి టేకుమూడి ఈశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రేక్షకుల అభిమానాన్ని లాభంగా మలచుకోవడానికి తొలి వారం రోజుల్లో టిక్కెట్ల ధర పెంచడం దారుణమన్నారు. సినిమా నటులు, అభిమానులకు ప్రత్యేకంగా చూపించాలనుకుంటే టిక్కెట్ల ధరపై రాయితీ ఇవ్వాలని ధరలు పెంచడం ఏంటని ప్రశ్నించారు.

రక్తదాన శిబిరానికి స్పందన

అమలాపురం రూరల్: లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వామీ వివేకానంద జయంతి సందర్భంగా ఆదివారం అమలాపురం సహస్ర బ్లడ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 23 మంది రక్తదానం చేశారు. శ్రీహరి హాస్పిటల్ వైద్యుడు శ్రీహరిరాయులు వెన్న, శ్రీరామ్ హాస్పిటల్ వైద్యుడు కొల్లు శ్రీనుబాబులు శిబిరాన్ని ప్రారంభించారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొలిశెట్టి తాతాజీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బ్లడ్ సెంటర్ ఎండీ శ్రీహరి, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు

పీటీఎం ట్రస్టు సేవలు అభినందనీయం

ఐ.పోలవరం: సేవా రంగంలో విశేష కృషి చేస్తున్న పుల్లెపు తాతయ్య మెమోరియల్ ట్రస్టు(పీటీఎం) సేవలు అభినందనీయమని డాక్టర్ కేసీహెచ్.అప్పారావు అన్నారు. ట్రస్టు నిర్వాహకుడు డాక్టర్ పుల్లెపు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ట్రస్టు వార్షికోత్సవ సభకు పలువురు మేధావులు పాల్గొని ప్రసంగించారు. అప్పారావు మాట్లాడుతూ జిల్లాలోని సాంస్కృతిక సంస్థలకు పీటీఎం ట్రస్టు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులకు బిరుదులు ప్రదానం చేశారు. గాన విభావరి, కవి సమ్మేళనంలో పాల్గొన్న మరో 50 మందిని ఘనంగా సన్మానించారు.

ఏటీఎంలో నగదు లేక ఇక్కట్లు

కాట్రేనికోన: స్థానిక స్టేట్ బ్యాంకు ఏటీఎంలో నగదు లేక ఆదివారం బ్యాంకు ఖాతాదారులు ఇబ్బందులు పడ్డారు. సంక్రాంతి పండగ సందర్భంగా ఇంటి ఖర్చుల కోసం నగదు డ్రా చేసేందుకు ఏటీఎంకు వెళ్లిన వారికి నిరాశే ఎదురయ్యింది. సుదూర ప్రాంతాలలో నివాసం ఉంటున్న వారు పండగకు స్వగ్రామాలకు ముందుగానే చేరుకున్నారు. ఏటీఎంలో నగదు లేక వారంతా తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఏటీఎంలో ఖాతాదారులకు అవసరమైన నగదు అందుబాటులో ఉంచడంతో పాటు సర్వర్లు అన్ని వేళలా పని చేసే విధంగా సంబంధిత అధికారులు దృష్టి సారించాలని వారంతా కోరుతున్నారు.